క్లుప్తంగా...

బోనాలకు రావాలని మంత్రులకు ఆహ్వానం



జగదీష్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు

రాంగోపాల్‌పేట్: ఈ నెల 9, 10వ తేదీల్లో జరుగనున్న సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతరకు రావాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు కలిసి దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌లకు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.91, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 40, పచ్చిమిర్చి 105, బజ్జీమిర్చి 73, క్యాప్సికమ్ 68, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 18, క్యారెట్ 45, దొండ 28, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 75, గోకరకాయ 35, కీర 35, దోసకాయ 21, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 19, ఆలుగడ్డ 21, చామగడ్డ 35, మొరంగడ్డ 23, కందగడ్డ 23, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

రేపు గురు పౌర్ణమి ఉత్సవాలు

రాంగోపాల్‌పేట్: ఈ నెల 3న సికింద్రాబాద్ కోనేరు వీధిలోని షిర్డీ సాయిబాబా దేవాలయంలో గురు పౌర్ణమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మేనేజింగ్ కమిటీ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి 11.30 వరకు క్షీరాభిషేకం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం సాయంత్రం 7 గంటల నుంచి భజనలు ఉంటాయన్నారు. 7.15 గంటలకు దీపోత్సవం, రాత్రి 10 గంటలకు శెజ్ హారతి ఉంటుందన్నారు.

జ్యోతిష్యం కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పద్మారావునగర్: జ్యోతిష్య శాస్త్రాన్ని నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆస్ట్రోలాజికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో జ్యోతిష్యం ఇతరత్రా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని నిర్వాహకులు రాంచందర్‌రావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జ్యోతిష్యం, వాస్తు, హస్తరేఖ శాస్త్రాల్లో జ్యోతిష్ ప్రవీణ, జ్యోతిష్య విశారద కోర్సులకు శిక్షణ ఇస్తున్నట్లు రాంచందర్‌రావు చెప్పారు. ఆసక్తిగల యువతీయువకులు సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని కౌతాకామకోటి కల్యాణ మండపం ఆవరణలోని కార్యాలయంలో సంప్రదించాలన్నారు.


చండీహోమం



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో శనివారం చండీ హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రపంచ శాంతి కోసం ఈ హోమం నిర్వహిస్తున్నట్లు ఈవో మనోహర్‌రెడ్డి తెలిపారు. హోమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దు

బన్సీలాల్‌పేట్: రోడ్లపై వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే చిరువ్యాపారులు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించరాదని చిలకలగూడ ట్రాఫిక్ ఎస్.ఐ. కరుణాకర్ విజ్ఞప్తి చేశారు. చిలకలగూడ ఈద్గా రోడ్డులో శనివారం సంత జరుగుతున్న ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. సంత సమయంలో చిరువ్యాపారులు రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు చేయరాదన్నారు. ఫుట్‌పాత్‌లపై దుకాణాలు పెట్టరాదని రోడ్లపైకి వచ్చి వ్యాపారాలు సాగిస్తే చర్యలు తప్పవన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు సంత జరుగుతున్న సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పద్మారావునగర్ ఏరియా గతంలో గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండేది అయితే ట్రాఫిక్ పోలీసు స్టేషన్ల విస్తరణలో భాగంగా ఈ ప్రాంతం చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చింది.



చిరువ్యాపారులకు సూచనలు చేస్తున్న ఎస్.ఐ కరుణాకర్

వైద్యుల సేవలు అమోఘం

రసూల్‌పురా: కరోనా విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలను లెక్క చేయకుండా వైద్య సేవలందించిన వైద్యులు దేవుళ్లతో సమానమని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. శనివారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా బొల్లారంలోని కంటోన్మెంట్ జనరల్ హాస్పిటల్‌లో విధులు నిర్వహిస్తున్న వైద్యులను జంపన ప్రతాప్ శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాత్రి పగలు తేడా లేకుండా ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు కరోనా విపత్కర పరిస్థితుల్లో అంకితభావంతో పనిచేసి వేలాదిమందికి వైద్యులు పునర్జన్మ ఇచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డా. రామకృష్ణ, డాక్టర్లు సత్యశీల్, హరికృష్ణ, వనజ, రితిక, సుధ కిరణ్మయి, వెంకటేష్, స్థానిక నేతలు అనిల్‌కుమార్, నాగేష్ యాదవ్ పాల్గొన్నారు.



సూపరింటెండెంట్ రాజారావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్ఎంఓలు



కేక్ కట్ చేస్తూ



వైద్యులను సన్మానిస్తున్న జంపన ప్రతాప్

ప్రభుత్వ ఆస్పత్రులే దేవాలయాలు

గాంధీఆస్పత్రి : అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో శనివారం పలు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించి, కేక్ కట్ చేసి సందడి చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు మాట్లాడుతూ.. నిరుపేదలకు ఉచిత వైద్యసేవలు అందిస్తున్న ఆస్పత్రులు దేవాలయాలని, చికిత్స పొందుతున్న రోగులు దేవుళ్లతో సమానమన్నారు. రౌండ్ ది క్లాక్ సేవలతో మానసిక, శారీరక ఒత్తిడికి గురవుతున్నప్పటికీ రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తమవంతు కృషి చేస్తున్న ప్రభుత్వ వైద్యులను అభినందించారు. సీఎం కేసీఆర్, వైద్యమంత్రి హరీష్ రావు, వైద్య ఉన్నతాధికారుల చొరవతో అత్యాధునిక వైద్యయంత్రాలు సమకూర్చుకున్నామని, నిష్ణాతులైన వైద్యులు అందుబాటులో ఉండడంతో గాంధీఆస్పత్రిలో ఇన్, అవుట్ పేషెంట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ప్రస్తుతం బెడ్ ఆక్యుపెన్సీ 170 శాతం ఉందన్నారు. వైద్యుల దినోత్సవం సందర్భంగా గాంధీ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో నగరంలోని మూడు ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించి వందలాది యూనిట్ల రక్తం సేకరించామన్నారు. అనంతరం ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. కేక్‌కట్ చేసి పుష్పగుచ్ఛాలు అందించుకుని పరస్పరం ఆలింగనాలు చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు, ఆర్ఎంఓ–1 జయకృష్ణలతో పాటు పలువురు హెచ్ఓడీలు, వైద్యులు, వైద్యవిద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు

పద్మారావునగర్: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా పేదలకు ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు సరోజిని దేవీ ప్రభుత్వ కంటి ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రవీందర్ గౌడ్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా శనివారం పద్మారావునగర్ పార్కులో డాక్టర్ రవీందర్ గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని దత్తత తీసుకొని పేదలకు తన ఆసుపత్రిలో ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించి అద్దాలు అందజేస్తామని వెల్లడించారు. పేదలకు ఉచితంగా వైద్య ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. బల్కంపేటలోని శంకర నేత్రాలయం ఆసుపత్రి ద్వారా ఉచితంగా కంటి అపరేషన్లు నిర్వహించి కంటి అద్దాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, నవీన్ గౌడ్, సంజయ్ యాదవ్, రాకేష్ కుమార్, శివ, రాము, సాగర్ గౌడ్, అజ్జు పాల్గొన్నారు.

లాలాగూడ రైల్వే కేంద్రీయ ఆస్పత్రిలో..

సికింద్రాబాద్: లాలాగూడ రైల్వే కేంద్రీయ ఆస్పత్రిలో ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ (ఏఐఆర్ఆర్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్స్ డే వేడుకలకు దక్షిణ మధ్య రైల్వే పీసీఎండీ సీకే. వెంకటేశ్వర్లు, పీసీటీపీ కిషోర్ బాబు, లాలాగూడ రైల్వే ఆస్పత్రి ఎండీ సురేందర్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కరోనా కష్ట సమయంలో ప్రాణాలకు తెగించి డాక్టర్లు అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. రైతులు వ్యవసాయం చేసి అన్నదాతలు అవుతుంటే వైద్యులు ప్రాణాలను కాపాడుతూ ప్రాణదాతలు అవుతున్నారని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఆర్ఆర్ఎఫ్ జాతీయ అధ్యక్షులు శ్రీధర్, సంయుక్త కార్యదర్శి కేఎస్. స్వామి, కోశాధికారి ఎస్ఆర్‌సీ రాజు, జోనల్ సెక్రటరీ యుగేందర్, కృష్ణ కుమారి, రాజేంద్ర పాల్, గిరిజ పాల్గొన్నారు.

వైద్య రంగానికి ప్రాధాన్యం..



వైద్యులతో గజ్జెల నాగేశ్

కంటోన్మెంట్: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్ అన్నారు. డాక్టర్స్‌డే పురస్కరించుకుని ఆరోవార్డు పరిధిలోని వీఆర్ ఆసుపత్రిలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనిషి రూపంలోని దేవుళ్లుగా వైద్యులు ప్రజల నుంచి మన్ననలు పొందుతున్నారు. కరోనా సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడరాని వారి సేవలను కొనియాడారు. త్వరలో వీఆర్ ఆసుపత్రిలో ఆరోగ్య సహాయత పథకం అమలయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఎండీ నంద కిషోర్, డాక్టర్లు శ్రీనివాస్, మురళీ కృష్ణ, మాధవి, నాయకులు రావుల సతీష్, నాగేష్ యాదవ్, శ్రీనివాస్, శివ, ప్రవీణ్, ఉదయ్, చందు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో..



వైద్యులను సన్మానిస్తున్న నోముల ప్రకాశరావు

చిలకలగూడ : అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు, వైద్యులు సంజీవరెడ్డి, శ్రీధర్, ఫణికుమార్ తదితరులకు శాలువతో సత్కరించి, జ్ఞాపికలను అందించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సాయిబాబా ఆలయ చైర్మన్ నైవేద్యం సాయికుమార్, సన్‌రేస్ ల్యాబొరేటరీ అధినేత జగన్, వేణు పాల్గొన్నారు.

50 ఏళ్ల కలను ప్రభుత్వం నెరవేరుస్తోంది

- ఓల్డ్ కస్టమ్స్‌బస్తీలో ఖబ్రస్తాన్ పనులు ప్రారంభం
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: బేగంపేట ఓల్డ్ కస్టమ్స్‌బస్తీలో ఖబ్రస్తాన్‌ను నిర్మించాలన్న దశాబ్దాల కలను తెలంగాణ ప్రభుత్వం సాకారం చేసిందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో ప్రభుత్వం కేటాయించిన రెండెకరాల స్థలంలో రూ.3 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఖబ్రస్తాన్ పనులను శనివారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థలం లేకపోవడం అత్యంత దయనీయమన్నారు. అనేక సందర్భాల్లో ఇక్కడి బస్తీ నివాసితులు తమ వారి మృతదేహాలతో రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపట్టిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఖబ్రస్తాన్‌కు స్థలం కేటాయించాలని గత 50 ఏళ్ల నుంచి ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులను కోరుతూ వచ్చారని, ఏ ప్రభుత్వం కూడా స్పందించలేదన్నారు. ఇక్కడ ఉన్న పరిస్థితులను ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లగా సీఎం ఆదేశాల మేరకు ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో స్థలం కేటాయించి నిర్మాణం కోసం రూ.3 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. అవసరమైతే అదనంగా ఇంకా నిధులు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఖబ్రస్తాన్ ఏర్పాటు చేయకుండా కొందరు అడ్డుకునే ప్రయత్నాలు చేశారని పేర్కొన్నారు. ఇదే ఓల్డ్‌కస్టమ్స్‌బస్తీలో రైల్వే పట్టాలను దాటుతూ అనేక మంది మరణించారని, బ్రిడ్జి నిర్మించి ఈ ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రాంతంలో అన్ని రోడ్ల నిర్మాణంతో పాటు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి ఓల్డ్‌కస్టమ్స్ బస్తీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ సుదర్శన్, వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభు, బస్తీ వాసులు సలీంఖాన్, అఖిల్, వాహీద్, నవాబ్, అబ్బాస్, ఆరీఫ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, నరేందర్ రావు, యాదగిరిగౌడ్, రాజయ్య, అఖిల్ అహ్మద్, శేఖర్, శ్రీనివాస్‌గౌడ్, నరేష్, పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

కంటోన్మెంట్: రజక వృత్తిదారులకు ప్రభుత్వ సంస్థలలో ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు కల్పించడం పట్ల బోయిన్‌పల్లి రజక సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బోయిన్‌పల్లిలోని బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి కార్యాలయంలోని ఆయనతో కలిసి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రజకుల సాధికారత కోసం వివిధ ప్రభుత్వ సంస్థల్లో కాంట్రాక్టు పద్ధతులను రజక కోఆపరేటివ్ సొసైటీల ఆధ్వర్యంలో నిర్వహించేలా జీఓ నెంబర్ 102 జారీ పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ జీఓ ప్రకారం ఎండోమెంట్, డీఎంఈ, స్పోర్ట్స్ హాస్టల్స్, ప్రభుత్వ బాలుర వసతి గృహాలు, పోలీసు హెడ్ క్వార్టర్స్, బెటాలియన్స్‌లో రజకులకు ప్రాధాన్యం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మర్రి రాజశేఖర్ రెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు లోకనాథం, శ్యాంకుమార్, నళిని కిరణ్ పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి



బేగంపేట బ్రౌన్‌బేర్‌లో జబర్దస్త్ ఫేమ్ వర్ష సందడి చేశారు. పలువురు మోడళ్లతో కలిసి బ్రౌన్ బేర్ లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. నగర వ్యాప్తంగా ఉన్న 25 ఔట్ లెట్లకు చెందిన కస్టమర్లకు సంబంధించి బేగంపేటలోని బ్రౌన్‌బేర్ బేకర్స్‌లో శనివారం సాయంత్రం లక్కీ డ్రా నిర్వహించగా కేపీహెచ్‌బీకాలనీకి చెందిన క్రాంతి ఎలక్ట్రిక్ బైక్ గెలుపొందారు. – సనత్‌నగర్

కరోనా సంక్షోభంలోనూ ఆర్థిక శక్తిగా భారత్

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: ప్రపంచం మొత్తం కరోనాతో ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టులాతుంటే మోదీ పాలనతో భారతదేశం ప్రపంచంలో ఐదో ఆర్థిక బలమైన శక్తిగా ఎదిగిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మహాజన్ సంపర్క్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని సిక్‌వాలా సమాజ్, క్లాత్ మర్చంట్ అసోసియేషన్, రాణిగంజ్ మెటల్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులతో ఆయన వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో మోదీ పాలనను అన్ని వర్గాల ప్రజలు ప్రశంసిస్తున్నారని గత పాలకుల హయాంలో దేశంలోని పలు నగరాల్లో ఉగ్రవాదుల దాడులు జరిగేవని కానీ నేడు వాటికి ఆస్కారం లేకుండా అణచివేశారని అన్నారు. రాష్ట్రంలో వారసత్వ, కుటుంబ పాలన సాగుతుందని దేశవ్యాప్తంగా బీజేపీలో అలాంటి సంస్కృతికి తావులేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, శ్యాంసుందర్‌గౌడ్, కార్పొరేటర్లు చీర సుచిత్ర, శ్రీకాంత్, కొంతం దీపిక, సరళ పాల్గొన్నారు.

ఉత్సాహంగా అవార్డుల ప్రదానం



సనత్‌నగర్: బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) వార్షిక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం ఉత్సాహంగా జరిగింది. ఆరో తరగతి నుంచి 11వ తరగతి వరకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలతో పాటు పుస్తక బహుమతులను అందజేశారు. పాఠశాల విద్యార్థి సార్థక్ లంబా రాష్ట్ర టాపర్‌గా నిలవడమే కాకుండా జాతీయ స్థాయిలో మూడో ర్యాంక్‌ను సాధించారు. పాఠశాల ప్రిన్సిపాల్ స్కంద్‌బాలి హాజరై విద్యార్థులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టుదల, నిబద్ధత, అంకితభావానికి నిదర్శనంగా ఈ అవార్డులు నిలుస్తాయన్నారు.

బ్యూటీ పార్లర్ ప్రారంభం



బౌద్ధనగర్: డివిజన్‌లోని వెస్లీచర్చి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యూటీ పార్లర్‌ను శనివారం డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేసే పనిలో నాణ్యత ప్రమాణాలు పాటించడం ద్వారానే వ్యాపారానికి మంచి పేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీలం సాయి యాదవ్, సునీత పాల్గొన్నారు.

తీరనున్న తాగునీటి కష్టాలు

రసూల్‌పురా: కంటోన్మెంట్ మూడవ వార్డు మడ్‌ఫోర్ట్ అంబేడ్కర్ హట్స్ తాగునీటి కష్టాలు ఎట్టకేలకు తీరనున్నాయి. దివంగత ఎమ్మెల్యే సాయన్న గతంలో అంబేడ్కర్ హట్స్‌లో పర్యటించిన సందర్భంలో గుడిసె వాసులు తాగునీటితో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా రూ.3 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. విడుదలైన నిధులు బోర్డు ఖజానాకు చేరడంతో బోర్డు వాటర్‌వర్క్స్ అధికారులు శనివారం తాగునీటి లైన్లు అభివద్ధి చేసేందుకు పైపులను అంబేడ్కర్ హట్స్‌లో దించారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు సాంబ అశోక్ మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి దశబ్దాలుగా ఉంటున్న నాలుగైదు వందల కుటుంబాల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఎమ్మెల్యే సాయన్న నిధులు మంజూరు చేశారని తమ తాగునీటి కష్టాలు దూరం కానున్నాయన్నారు. వాటర్‌వర్క్స్ ఏఈ శ్రవణ్ ఆధ్వర్యంలో పైపులైన్ల ఏర్పాటుకు కొలతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు వెంకట్‌రాములు, రోశప్ప, గురువయ్య, కనకసుందర్, రంగస్వామి, సాయిదేవ్ పాల్గొన్నారు.



పైప్‌లైన్లు వేసేందుకు కొలతలు తీసుకుంటున్న ఏఈ శ్రవణ్

చెవి, ముక్కు, గొంతు సమస్యలపై అవగాహన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

సనత్‌నగర్: అల్లాఉద్దీన్ కోఠి బస్తీ కమ్యూనిటీ హాల్‌లో గౌడ ఈఎన్‌టీ ఆస్పత్రి ఆధ్వర్యంలో చెవి, ముక్కు, గొంతు సమస్యలపై శనివారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ గౌడ రమేష్, డాక్టర్ నందిని బృందం వైద్య పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు. అలాగే అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి ప్రతినిధులు ప్రకాష్‌రావు, శ్రీధర్, శివ, శోభన్‌లతో పాటు బస్తీ అధ్యక్షులు కరీంలాల్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగిన మైకంలో కత్తితో దాడి

బన్సీలాల్‌పేట్: తాగినమత్తులో ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన సంఘటన గాంధీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ జీవన్‌రెడ్డి కథనం ప్రకారం.. బోయిగూడ కేస్ బ్లాక్‌లో రిటైర్డ్ పోస్టల్ ఉద్యోగి ఎం. చేతన్ (62) శుక్రవారం రాత్రి భోజనం చేసి స్థానికంగా ఉన్న ఓ షాపు ముందు కూర్చున్నాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ వ్యక్తి చేతన్‌ను అడ్రస్ అడిగినట్లు నటించి కత్తితో దాడి చేయడంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా చెవికి కుట్లు పడ్డాయి. చేతన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం



మణికంఠ

బౌద్ధనగర్: వాకింగ్‌కు వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్ వివరాల ప్రకారం.. రాంనగర్ ప్రాంతానికి చెందిన మణికంఠ (21) మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాడు. జూన్ 11న ఇంటి నుంచి బయటకు వెళ్లిన మణికంఠ ఐదు రోజుల తర్వాత ఇంటికొచ్చాడు. అదే విధంగా జూన్ 23న ఉదయం వాకింగ్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన ఎంతకీ ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు తెలిసిన వారు, బంధువులను వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో తల్లి రాధ పోలీసులకు ఫిర్యాదు చేసింది.



కేంద్ర పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బౌద్ధనగర్: ప్రధాని మోదీ తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. ఈ మేరకు శనివారం పార్శిగుట్టలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. బీజేపీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలు, స్టిక్కర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమంతు, సత్యనారాయణ, వెంకటేష్ యాదవ్, సత్య, ఓములు, శ్యామ్, శ్రీనివాస రాజు, రమేష్ పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

స్వరూప గౌడ్ ఆధ్వర్యంలో..

బౌద్ధనగర్: మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా శనివారం డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సంస్థాగతంగా డివిజన్‌ను బలోపేతం చేసేందుకు సబ్ డివిజన్ ఇన్‌చార్జులను నియమించాలన్నారు. రాబోయే రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తొమ్మిదేళ్ల పాలనలో ప్రధాని మోదీ చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రవిప్రసాద్ గౌడ్, నాగేష్ రెడ్డి, లడ్డు, అమరావతి, నాగేష్, బైరి సురేష్, గంజి నవీన్, ప్రసాద్, శ్యామ్ పాల్గొన్నారు.

జగదీష్‌నగర్ కాలనీలో..

రసూల్‌పురా: మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు సుష్మిత ఆధ్వర్యంలో కంటోన్మెంట్ నియోజకవర్గంలోని రసూల్‌పురా 37వ బూత్ నంబర్ జగదీష్‌నగర్ కాలనీలో ఇంటింటికి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సుష్మిత మాట్లాడుతూ.. అధికారంలోకి రావడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ పథకాల పేర్లు మార్చి తమ పథకాలుగా ప్రకటించుకుంటున్నారని ఆరోపించారు. తొమ్మిదేళ్ల పాలనలో మోదీ పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీజేపీ జెండా రెపరెపలాడిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వినోబ్ (కేరళ) వార్డు అధ్యక్షుడు మాదరపు అశోక్. ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జగన్, రాకేష్, శ్రీశైలం, శ్యామ్, శ్రీహరి, జనార్దన్ పాల్గొన్నారు.